క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కమలాపురం : స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఒకటవ సచివాలయ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డిని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. విశ్వనాథ్ రెడ్డి ఇటీవల కడుపునొప్పి కారణంగా కర్నూలులో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే సోమవారం ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కండి

కమలాపురం: ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుల్ పిలుపునిచ్చారు. సోమవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లుగా ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాబుతారా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

చెన్నూరు : చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలో నేరాలకు సంబంధించి జప్తు చేసిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు వాహనాల వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు చెన్నూరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

ట్రాఫిక్ సమస్య నివారించండి



సింహాద్రిపురం బస్టాండు సెంటర్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం బస్టాండు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బస్టాండు సెంటర్‌వద్ద బస్సులు తిప్పుకోవడం వలన ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. తరచూ బస్టాండు సెంటర్‌లో ఏదో ఒక ప్రమాదం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు ఆది శంకరాచార్యుల జయంతి

కడప కల్చరల్ : జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల బిట్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షుడు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద నుంచి ఉదయం 5.30 గంటలకు పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 7.00 గంటలకు ధర్మాచార్యులు పసుపులేటి శంకర్ శంకర జయంతి విశిష్టతపై ప్రవచనం చేబుతారని, ఈ ధర్మ ప్రచార కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

ఆప్కోలో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివాహాలు, వేసవిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో కడప డివిజన్‌లో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి వరప్రసాద్ తెలిపారు. కడప నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలోని తమ షోరూంలోని క్లియరెన్స్ సేల్స్ కౌంటర్‌లో ఈనెల 20 నుంచి ఈ అమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. అలాగే 1+1, 1+2 విక్రయాల కూడా జరుగుతున్నాయని వివరించారు. మాధవరం, రాజమండ్రి, బందరు, వెంకటగిరి, చీరాల, ఉప్పాడ చీరలు, పొందూర్ షర్టింగ్, పట్టు, కాటన్ దోవతులు, టవళ్లు కొనుగోలు చేసి చేనేతలను ప్రోత్సహించాలన్నారు.

ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ క్యాంపు ప్రారంభమైంది. ఈ క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేసేందుకు ఎన్ఎస్ఎస్ ఒక చక్కటి మార్గమన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే స్పెషల్ క్యాంపులో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

పల్లెకు పురస్కారం.. ప్రగతికి ప్రోత్సాహం

వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన పలు పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేసి అభివృద్ధిలో మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్లేలా ప్రోత్సాహం అందించింది.



చెన్నూరు : జెడ్పీ చైర్మన్, కలెక్టర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు, సర్పంచ్



సింహాద్రిపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

చెన్నూరు : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బయనపల్లె గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎంపికై జిల్లా స్థాయి ప్రథమ బహుమతి తీసుకున్నట్లు ఎంపీడీఓ గంగనపల్లె సురేష్‌బాబు, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం వారు చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి పేదరికం లేని అలాగే మెరుగైన జీవనోపాధుల గ్రామ పంచాయతీ విభాగంలో ఈ అవార్డు లభించిందన్నారు. ఈ అవార్డు రావడానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. బయనపల్లె పంచాయతీకి అవార్డు రావడం పట్ల ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ పంచాయతీలకు ప్రశంసాపత్రాలు

సింహాద్రిపురం : మండలంలో అభివృద్ధి చెందిన పంచాయతీలకు ప్రశంసా పత్రాలు అందించినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 9 విభాగాలలో అభివృద్ధి కనబరిచిన పంచాయతీల గ్రామ సర్పంచ్‌లకు ఎంపీడీఓ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన విభాగంలో కాంబల్లె, రెండవ చవ్వారిపల్లె, లోమడ, ఆరోగ్యకరమైన పంచాయతీ విభాగంలో అంకాలమ్మగూడూరు, బలపనూరు, చవ్వారిపల్లె, పిల్లల స్నేహపూర్వక విభాగంలో చవ్వారిపల్లె, కోవరంగుంటపల్లె, కాంబల్లె, నీటి సమృద్ధికళ విభాగంలో బలపనూరు, కసనూరు, కోవరంగుంటపల్లె. క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో బలపనూరు, సింహాద్రిపురం, చవ్వారిపల్లె.. స్వయం సమృద్ధి విభాగంలో బలపనూరు, చవ్వారిపల్లె, సింహాద్రిపురం.. సామాజిక భద్రత కల్పన విభాగంలో లోమడ, చవ్వారిపల్లె, కాంబల్లె.. సుపరిపాలన విభాగంలో సింహాద్రిపురం, బలపనూరు, లోమడ.. మహిళ స్నేహ పరిపక్వత విభాగంలో రావులకొలను, సుంకేసుల, పైడిపాలెం పంచాయతీలు మొదటి, రెండవ, మూడవ స్థానాలలో నిలిచాయి. ఆ పంచాయతీలకు ఆయా గ్రామ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా దొడియం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారానికి దొడియం పంచాయతీ ఎంపికై ంది. సోమవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమయూన్‌ను జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. దొడియం ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం పట్ల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



దొడియం పంచాయతీ కార్యదర్శి సుమయూన్‌ను సన్మానిస్తున్న జిల్లా అధికారులు



జమ్మలమడుగు : సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు

పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తా



వేంపల్లె : పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని సర్పంచ్ ఎం.సులోచన పేర్కొన్నారు. వేంపల్లె మండలం నందిపల్లె గ్రామ పంచాయతీ పిల్లల స్నేహపూర్వక విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కడపలోని జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ వి.విజయరామరాజు చేతులమీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నందిపల్లె గ్రామ పంచాయతీగా ఏర్పడిన అనతికాలంలోనే ఉత్తమ అవార్డు లభించడం చాలాసంతోషంగా ఉందన్నారు.

గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లే కీలకం

జమ్మలమడుగు : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచ్‌లే కీలకమని మండల ప్రత్యేకాధికారి ఖాదర్ బాషా పేర్కొన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎంపీపీ హరిత అధ్యక్షతన గ్రామ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను తెలుసుకుని మౌలిక సదుపాయాలు కల్పించేది పంచాయతీరాజ్ వ్యవస్థ అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన గూడెంచెరువు సర్పంచ్ మజ్జారి నాగేశ్వరి, గొరిగెనూరు, శేషారెడ్డిపల్లె గ్రామ సర్పంచ్‌లను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పరిపూర్ణ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలుచేపట్టాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : వేసవి కాలంలో మైలవరం మండలంలో తాగునీటికి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వై. రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోనుభాయ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన సాగాలి



అవార్డు అందుకుంటున్న ఎర్రగుడిపాడు సర్పంచ్, ఎంపీటీసీ, సచివాలయ సిబ్బంది

కమలాపురం: ప్రజారంజక పాలన అందించినప్పుడే సేవకులను జీవితాంతం ప్రజలు గుర్తు చేసుకుంటారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 9 అంశాల్లో వివిధ స్థాయిలో అవార్డులు పొందిన పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్, వైఎస్సార్, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలను ప్రజలు జీవితాంతం గుర్తు చేసుకుంటారన్నారు. వారు అందించిన పథకాలే వారిని గుర్తు చేస్తాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చిత్త శుద్ధితో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ చలపతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ భారతి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగిరెడ్డిపల్లెకు ఉత్తమ పంచాయతీ అవార్డు

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ త్తమ పంచాయతీగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికై ంది. పంచాయతీలోని సమస్యలను గుర్తించడంలో సర్పంచ్ కల్లూరు శిరీష ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. జగనన్న కాలనీ నిర్మాణం సత్వర పూర్తికి స్థానిక ఎంపీటీసీ రఘునాథరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి సారించారు. గంగిరెడ్డిపల్లె గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారం మరువలేనిది



గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిది. ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. పదవీ కాలం ముగిసే లోపు గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ పంచాయతీగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తాను.

-కల్లూరు శిరీష
(పంచాయతీ సర్పంచ్, గంగిరెడ్డిపల్లె)

అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది



రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. సర్పంచ్ శిరీష, గ్రామస్తులు, నాయకులు, సిబ్బంది అందించిన సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగాం. వారి సహకారం మరువలేనిది.

-మస్తాని
(పంచాయతీ కార్యదర్శి, గంగిరెడ్డిపల్లె)

మెగా పీపుల్స్ సర్వే ఓ చరిత్ర

ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే ఓ చరిత్ర అని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజనేయులు రెడ్డితో కలసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మెగా పీపుల్స్ సర్వే ఓ చరిత్ర సృష్టించిందన్నారు. 7 లక్షల మంది పార్టీ సైనికులు కోటి కుటుంబాలను సందర్శించి చేసిన సర్వేలో 78 లక్షల 68వేల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నియోజకవర్గంలో 72,150 కుటుంబాలకు గాను 52,351 కుటుంబాలను సందర్శించి సర్వే చేశారన్నారు. ఇంత ఆదరణ ఉన్న ఏ పార్టీ రాష్ట్రంలోనే కాదు... దేశంలోనే లేదన్నారు. మరో ఐదు రోజులు గడువుందని, మిగిలిన కుటుంబాలన్నింటిని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి మద్దతు కోరుతామన్నారు. జగనన్న అందిస్తున్న పథకాలతోనే ప్రభుత్వానికి ఇంత ఆదరణ లభించిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దేశంలోనే సుపరిపాలన అందిస్తున్న నెంబర్ వన్ ప్రభుత్వం అన్నారు. సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, నిఖిల్‌రెడ్డి, జావీద్, జగన్‌మోహన్ రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను ప్రారంభించిన మాజీ ఎంపీపీ

ముద్దనూరు(జమ్మలమడుగు): మండల పరిధిలోని ఆకుతోట పల్లి పూల చెరువు, పెద్దచెరువులకు నీరు నింపడం కోసం 6 కోట్ల 30 లక్షల రూపాయలతో చేపట్టిన పనులను మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.మునిరాజారెడ్డి ప్రారంభించారు. సోమవారం మండల పరిధిలోని కొండ్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న జీఎన్ఎస్ఎస్ కాలువ వద్ద నుంచి 4.5 కిలోమీటర్ల దూరం వరకు పైప్‌లైన్ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సహకారంతో ఈ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఈ వాసుదేవరెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ రేణుకా, మాదన్నగారిపల్లి సర్పంచ్ జయరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు శివ పార్వతుల కల్యాణం

వల్లూరు: పుష్పగిరి క్షేత్రంలో భాగమైన చింతల పత్తూరులోని శ్రీ ఇంద్ర నాథేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు శివ పార్వతుల కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం రుద్ర హోమం, విభూతి అలంకార సేవ ఉంటుందని తెలిపారు.

29న బహిరంగ సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 29న నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకట శివ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ప్రచార భేరి, ప్రదర్శన, సభకు సంబంధించిన కరపత్రాలను వామపక్ష నాయకులు ఆవిష్కరించారు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఓబులేసు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉమా మహేశ్వరరావు హాజరవుతున్నట్లు తెలిపారు.

హెల్త్ ఇన్‌స్పెక్టర్ అదృశ్యం

కడప అర్బన్: కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సవరాల శివప్రసాద్ (40) 2018 నుంచి కనిపించలేదు. ఈయనకు భార్య సవరాల వాణి, ఇద్దరు పిల్లలు సంతానం. ఒక కాలు పోలియో రావడంతో చిన్నప్పటి నుంచి దివ్యాంగునిగానే వున్నారు. మతిస్థిమితంలేక అపుడపుడు ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. చివరగా 2018 నుంచి రాలేదనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

విద్యార్థుల సమక్షంలోనే తనిఖీ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ స్టెల్లా షర్మిలరాణి

చెన్నూరు : పాఠశాలల్లో విద్యార్థుల సమక్షంలోనే ఉపాధ్యాయులు తనిఖీ నిర్వహించాల్సి ఉంటుందని మండల విద్యాశాఖాధికారి స్టెల్లా షర్మిలరాణి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల సామాజిక తనిఖీలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్‌పీ సురేష్, కోర్సు కో ఆర్డినేటర్‌గా మండల విద్యాశాఖాధికా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె యాప్ అప్‌లోడ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ దశరథరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులకు చూపు



మృతుడి కార్నియాలను కుటుంబ సభ్యుల నుంచి అందుకుంటున్న రాజు, తదితరులు

పులివెందుల టౌన్ : నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించినట్లవుతుందని నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. పట్టణంలోని రాజారెడ్డి కాలనీకి చెందిన వృద్ధుడు దేవిరెడ్డి కుళ్లాయిరెడ్డి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజును సంప్రదించారు. దీంతో వెంటనే మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఎవరైనా నేత్రదానం చేయదలుచుకున్న వారు 9966509364, 7093204537 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నేత్రనిధి సంస్థ టెక్నీషియన్ హరీష్, కుటుంబ సభ్యులు, బంధువులు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీలో ఉర్దూ మీడియం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని ఏపీ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమాం బాషా, సయ్యద్ ఇక్బాల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా సరిపడా ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. రాబోయే డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని కోరారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకొంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇందుకూరు సచివాలయ పరిధిలోని కొత్తపల్లె, అయ్యవారిపల్లె, గడ్డంవారిపల్లె, ఇందుకూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి గత నాలుగు సంవత్సరాల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరిందో వారికి వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, రాష్ట్ర మైనింగ్, పౌర సరఫరాల డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, రోజా రాణి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, స్థానిక నాయకులు, గోపాల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నందకుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో పనిచేస్తాం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు స్ఫూర్తితో దృఢ సంకల్పంతో పని చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు టి.బాలయ్య, మండల పార్టీ ఇన్‌చార్జి ఎం. సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు పేరుతో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం ఎర్రగుంట్లలోని పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు అందరి సమష్టి కృషితోనే ఈ కార్యక్రమం నియోజకవర్గంలో ముందంజలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు మహమ్మద్ ఆలీ, పెన్నా రషీద్, డి.సూర్యనారాయణ రెడ్డి, ఓబుళరెడ్డి, ఎరికలరెడ్డి, కల్లె వెంకటేశు, షాహిద్, కోకోకోలా గౌస్, చిన్నషేట్, ప్రశాంత్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, ఇస్మాయిల్, ఉప మండలాధ్యక్షుడు మల్లు మోహన్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, షర్ఫుద్దీన్, దివాకర్‌రెడ్డి, దండే రవిప్రకాశ్‌రెడ్డి, అబ్దుల్ గఫూర్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

వేముల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిర పాలన సాధ్యమని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వేముల మండలం రాచకుంటపల్లె గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, రమణ, సుధాకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మంచి ఆదరణ: మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్ మనోహర్ రెడ్డి స్వగృహంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జులు హఫీజుల్లా, చంద్రమౌళిలతో కలిసి ఆయన మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మెగా పీపుల్స్ సర్వేలో తొలి 15 రోజుల్లోనే కోటి కుటుంబాలు పాల్గొనగా.. సీఎం జగనన్న పాలనకు మద్దతుగా 70లక్షలకుపైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నవరత్నాల హామీలను 100శాతం నెరవేర్చిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

జగనన్నే మా నమ్మకం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని శేషారెడ్డి స్కూలు, ప్రశాంతి నగర్ ప్రాంతాలలో జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ - జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్యామల, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసారెడ్డి, కో.ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, చలపతి తదితరులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ బ్రోచర్‌ను అందిస్తున్న పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి తదితరులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు